నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 10 డిసెంబర్ 2024 | SURYAPET




కనగల్‌లో జూనియర్ కాలేజీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



## ఎమ్మెల్సీ కోటిరెడ్డి అరెస్టు

అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా, హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిని అదుపులోకి తీసుకుని వ్యాన్‌లో తరలిస్తున్న దృశ్యమిది.

# కాంగ్రెస్‌ది కక్షపూరిత పాలన

**ఎన్ని మార్పులు చేసినా తెలంగాణ ప్రజల నుంచి కేసీఆర్‌ను వేరు చేయలేరు**

**కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కుట్ర**

- అందులో భాగమే తెలంగాణ తల్లి విగ్రహం మార్పు
- పదేండ్లలో సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసిన ఘనత కేసీఆర్‌దే..
- మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య
- నల్లగొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం..
- సచివాలయంలో మార్పు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టాపనపై నిరసన



నల్లగొండ ఎన్‌జీ కాలేజీ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 9 : ప్రాణాలు ఫణంగా పెట్టి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తూ నాశనం చేస్తున్నదని నల్లగొండ, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ప్రతిష్ఠించడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల వద్ద సోమవారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి వారు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో భూపాల్‌రెడ్డి, చిరుమర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సంస్కృతి విధ్వంసం జరుగుతుందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు మారుస్తున్నారో కాంగ్రెస్ నాయకులకే స్పష్టత లేదని తెలిపారు. కేసీఆర్ తీసుకొచ్చిన సాంస్కృతిక మార్పును కనుమరుగు చేసే ప్రయత్నం జరుగుతుందని మండిపడ్డారు. ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహం గురించి ఇంచెత్తు విమర్శ చేయకుండా ఇప్పుడు తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చడం కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేయడంలో భాగమేనని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న వారందరూ కూడా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన వారే కదా అని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ గీతాన్ని సరైన క్రమంలో లేకుండా మార్చిన విధానాన్ని ప్రజలు తిరస్కరించుకుంటున్న విషయాన్ని యాది మరువొద్దన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతీసంప్రదాయాలు తెలువని మూర్ఖులు కాంగ్రెస్ పాలకులు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున సాగర తీరాన అతిపెద్ద అమరవీరుల స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దే అని గుర్తు చేశారు. ప్రతి ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు చీరెలను పంపిణీ చేశారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా నిరంతరం కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకునే ఆలోచనలను కాంగ్రెస్ పాలకులు మానుకోవాలన్నారు. విగ్రహాల రూపును మార్చినంత మాత్రాన కేసీఆర్ నుంచి తెలంగాణను వేరు చేయలేరని స్పష్టం చేశారు. కేసీఆర్ మంజూరు చేసిన నిర్మించిన మెడికల్ కళాశాలను కాంగ్రెస్ పాలకులు ప్రారంభించి తామే నిర్మించినట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏడాది కాలంలో ఒక్క పని అదనంగా మంజూరు చేయించలేదని, సీఎం తో నల్లగొండ అభివృద్ధికి ప్యాకేజీ ప్రకటింప జేయలేక పోయారని విమర్శించారు. నల్లగొండ ప్రజలు ప్రతి ఒక్కటీ గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెప్తారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, కల్లుగీత రాష్ట్ర కార్మిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమాన్యు శ్రీనివాస్, కౌన్సిలర్ మారగోని గణేశ్, కో ఆప్షన్ సభ్యులు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, సీనియర్ నాయకులు మాలె శరణ్యారెడ్డి, సింగం రామ్మోహన్, నారబోయిన భిక్షం, బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, ,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షులు అన్వర్ పాష, నాయకులు అయితగోని యాదయ్య, మెరుగు గోపి, మాతంగి అమర్, దొడ్డి రమేశ్, శంషుద్దీన్,వీరమళ్ల భాస్కర్, బడుపుల శంకర్, తవిటి కృష్ణ, కంకణాల వెంకటరెడ్డి, సింగం లక్ష్మి, మామిడి పద్మ, యాట జయప్రదరెడ్డి, కొప్పోలు విమలమ్మ, కొండ స్వరూప, కున్‌రెడ్డి సరోజ, కంచర్ల విజయరెడ్డి, బొట్టు మల్లికాంబ, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

**విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ సిటీ, డిసెంబరు 9 : కనగల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం సందర్శించారు. వంట గది, పాఠశాల పరిసరాలు, వంట పాత్రలు శుభ్రం చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. కిచెన్, పాఠశాల అవరణలో పరిశుభ్రత లోపించడంపై ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెసిడెన్సియల్ పాఠశాలలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాఠశాలల్లో పారిశుధ్య లోపం, మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రత, నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా కేజీబీవీలో 230 మంది విద్యార్థులు ఉండగా 3వ తరగతి విద్యార్థులకు బెంచీలు లేకపోవడంతో కింద కూర్చోవడం గమనించిన కలెక్టర్ తక్షణమే బెంచీల ఏర్పాటు కోసం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్‌కు లేక రాయాలని ఆదేశించారు. దాంతోపాటు అదనపు గది నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాపించాలని తెలిపారు. అనంతరం కనగల్ మండలానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జూనియర్ కళాశాలను మంజూరు చేయగా కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ముందుగా ఎస్‌ఎల్‌బీసీ ఆవరణలో ఉన్న తాసీల్దార్ కార్యాలయం చుట్టు పక్కల స్థలాన్ని, సర్వే నంబర్ 591లో కేజీబీవీ పక్కన స్థలాన్ని, 339 సర్వే నంబర్‌లో పల్లె ప్రకృతి వనం వద్ద స్థలాన్ని కలెక్టర పరిశీలించారు. ప్రభుత్వం గత వారం కనగల్, తిప్పర్తి మండలాలకు జూనియర్ కళాశాలలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కనగల్ మండలంలో జూనియర్ కళాశాలతో పాటు ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని చూడాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాల, స్టేడియం నిర్మిణానికి 10 ఎకరాల స్థలం అవసరం ఉందన్నారు. ఆమె వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తాసీల్దార్ పద్మ, ఎంపీఓ సుమలత,ఆర్‌ఐ, స్థానిక నాయకులు గోలి జగాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గుర్రంపోడులో తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

# రైతులను నట్టేట ముంచిన సర్కారు

- రుణమాఫీ చేయకుండా కాలయాపన
- గుర్రంపోడులో రైతుల రాస్తారోకో

గుర్రంపోడ్, డిసెంబర్ 9 : రైతు రుణమాఫీ అందరికీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని, వెంటనే రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార మహ్మద్ ఫరీదుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు జక్కలి నర్సింహ్మ, వనమాల కామేశ్వర్ మాట్లాడుతూ అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను, రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇంకా గ్రామాల్లో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగో విడుతలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడ్స లాలయ్య, మల్లయ్య, మోపూరి ఆచారి, మారయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచేలా పని చేయాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- జిల్లాకు కొత్తగా 291 మంది కానిస్టేబుళ్లు

నీలగిరి, డిసెంబర్9 : ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ఇటీవల ఎంపికై జిల్లాకు వచ్చిన 192 పురుష, 99 మహిళ కానిస్టేబుళ్లకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఎంతో ఉన్నతమైందని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలంటే అది పోలీస్ శాఖ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. శిక్షణలో తెలిపిన విధంగా నియమ నిబంధనలు పాటిస్తూ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

### బాధితుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ శరత్ చంద్ర పవార్ వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 35 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌ల అధికారులకు బదిలీ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.



నల్లగొండ జిల్లాకు కొత్తగా వచ్చి కానిస్టేబుళ్లు

# గంజాయి పట్టివేత.. ఆరుగురు అరెస్ట్

మోతె, డిసెంబర్ 9: గంజాయి విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సుభాశ్ హంతాల అనే గంజాయి విక్రేతకు నెల రోజుల క్రితం అరకు వెళ్తుండగా రైలులో బత్తుల హరీశ్, బత్తుల విరాట్ అనే ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు పరిచయమయ్యారు. అప్పటి నుంచి ముగ్గురు కలిసి గంజాయి విక్రయిస్తున్నారు. ఈ నెల 5న హరీశ్, విరాట్ కలిసి సుభాష్‌కు ఫోన్ చేసి గంజాయి కావాలని, ఖమ్మం తీసుకురావాలని చెప్పారు. దీంతో సుభాశ్ 8వ తేదీన గంజాయితో ఖమ్మం వచ్చాడు. విరాట్, హరీశ్‌తో పాటు షేక్ హుస్సేన్ బాషా అనే మరో వ్యక్తి సుభాష్‌ను కలిసి గంజాయితో రెండు బైక్‌లపై మామిళ్లగూడెం గ్రామ శివారులోని సింగరేణి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత హరీశ్, విరాట్ కలిసి తమకు పరిచయస్థులైన గంజాయి సేవించే వెలుగు జయసింహ, దోసపాటి కల్యాణ్‌రామ్, పగడాల ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెలుగు ఆనంద్, కొండా ఉదయ్‌ను టోల్‌ప్లాజా వద్ద గల ఓ వెంచర్‌కు పిలిచారు. అప్పటికే సమాచారం అందుకున్న మోతె పోలీసులు దాడులు నిర్వహించి సుభాష్, హరీశ్, విరాట్, జయసింహ, కల్యాణ్‌రామ్, ఉదయ్‌కుమార్‌రెడ్డిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ముగ్గురు మైనర్లని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి 1.640 కిలోల గంజాయిని, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు



అరెస్ట్ చేయడంతో కనగల్ పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

# ఎక్కడికక్కడ మాజీ సర్పంచుల అరెస్ట్

- చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లకు తరలించి నిర్బంధం



తిరుమలగిరిలో మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్9(నమస్తే తెలంగాణ) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో హైదరాబాద్‌కు వెళ్తున్న మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో తరలివెళ్లకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తెల్లవారుజాము నుంచే పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి నిఘా పెట్టారు. నల్లగొండ, మిర్యాలగూడ, కనగల్, చండూరు, మాడ్గులపల్లి, నాంపల్లి, పెద్దవూర, త్రిపురారం, నిడమనూర్, దేవరకొండ, హాలియా, నకిరేకల్, కట్టంగూరు, మునుగోడు తదితర మండలాల్లో మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, గరిడేపల్లి, మోతె, చిలుకూరు, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం, మద్దిరాల, నూతనకల్.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి, గుండాల, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజాపేట తదితర మండలాల్లో మాజీ సర్పంచులను అరెస్ట్ చేశారు. చలో హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతి లేదంటూ పోలీసులు తేల్చిచెప్పారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రాజధానిలో ఆందోళనలు చేపడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

## 11న ఎస్సీ వర్గీకరణ కమిషన్ రాక


నల్లగొండ, డిసెంబర్ 9 : ఎస్సీ వర్గీకరణను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ ఈ నెల 11న నల్లగొండకు రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు వివరణాత్మక అధ్యయనం కోసం కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన బృందం రానుందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్సీ కుల సంఘాల నుంచి వినతులు స్వీకరించి బహిరంగ విచారణ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు ఈ బహిరంగ విచారణ ఉండనున్నందున ఎస్సీ కులాల వారు తమ విన్నపాలతో రావాలని ఆమె సూచించారు.

## ఈ నెల 11, 17, 21 తేదీల్లో సదరం క్యాంప్

సూర్యాపేట, డిసెంబర్ 9 : డిసెంబర్ నెల కోసం విడుదల చేసిన సదరం స్లాట్‌లను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11, 17, 21వ తేదీల్లో సదరం క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందుకు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని, స్లాట్ బుక్ అయిన వారు వారికి కేటాయించిన తేదీల్లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో ఉదయం 9 గంటలకు క్యాంపునకు హాజరుకావాలని తెలిపారు.

# 70వ వసంతంలోకి ఆధునిక దేవాలయం

**1955 డిసెంబర్ 10న నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన**



నాగార్జునసాగర్ డ్యామ్

- పూర్తి స్వదేశీయ పరిజ్ఞానం, మానవశక్తితో నిర్మాణం
- 1967లో కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల
- బీడు భూములను సస్యశామలం చేసిన కల్పతరువు

నందికొండ, డిసెంబర్ 9 : తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు అన్నపూర్ణగా విరాజిల్లుతూ, ఆధునిక దేవాలయంగా పేరొందిన నాగార్జునసాగర్ ఆనకట్టకు శంకుస్థాపన చేసి నేటికి 69 వసంతాలు పూర్తి చేసుకొని 70వ వసంతంలోకి చేరింది. రైతులు కరువుతో విలవిలాడుతున్న సమయంలో ముక్త్యాల కోట రాజైన రాజా రామగోపాల్ కృష్ణ మహేశ్వరప్రసాద్ ఆలోచనతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి బీజం పడింది. 1955 డిసెంబర్ 10న ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టు నిర్మాణానికి నందికొండలోని పైలాన్‌కాలనీలో పిల్లర్‌తో శంకుస్థాపన చేశారు. నాగార్జునసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్ట్‌ను వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రథమ స్థానం కల్పిస్తూ పెద్దవూర మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో నందికొండ గ్రామం వద్ద కృష్ణానదిపైన నిర్మించారు. ప్రపంచంలోనే రాతి ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు మొదటిస్థానం. 1955 నుంచి 1967 వరకు దాదాపు 12 సంవత్సరాల పాటు పూర్తిగా స్వదేశీయ ఇంజినీర్ల పరిజ్ఞానంతో, లక్షలాది మంది కూలీల మానవశక్తితో నిర్మాణం చేశారు. 11,70,000 వరద నీటిని ప్రధాన డ్యామ్ దిగువ భాగంలో 1540 అడుగుల నిడివి గల జల ప్రవాహిత( స్పిల్‌వే ) మీదుగా విడుదల చేసే విధంగా 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేశారు. కుడి కాల్వ ద్వారా 11,74,874 ఎకరాలకు, ఎడమ కాల్వ ద్వారా 10,37,796 ఎకరాలకు నీరు అందించేలా కాల్వలను నిర్మించారు. ఎడమ కాల్వ, కుడి కాల్వ వద్ద, ప్రధాన డ్యామ్ దిగువన జలవిద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి 1.63లక్షల కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా డ్యామ్‌ను నిర్మించారు. డ్యామ్ పూర్తి స్థాయిలో నిండితే ఆయకట్టు పరిధిలో రెండు సీజన్‌లో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. నల్లగొండ, ఖమ్మం, గుంటూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాలకు సాగునీటితోపాటు హైదరాబాద్‌కు ఇక్కడి నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది డ్యామ్ పుష్కలంగా నీరు ఉండడంతో తాగు, సాగుకు నీటికి సమస్య లేదని అధికారులు చెబుతున్నారు.